క్లుప్తంగా

మహిళలపై సర్కార్ చిన్నచూపు

సిరిసిల్లటౌన్: మహిళలపై రాష్ట్ర సర్కారు చిన్న చూపు చూడటం సరికాదని దివ్యాంగుల సంక్షేమ సంఘం సిరిసిల్ల అధ్యక్షురాలు ఆకుల సంధ్య అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సంఘ సమావేశంలో మాట్లాడి పలు తీర్మానాలు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా దివ్యాంగులు, మహిళలకు స్కూటీలు, జాబితాలో పేర్లు వచ్చిన పేదలకు డబుల్‌బెడ్రూం ఇండ్లు వెంటనే ఇవ్వాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, జువ్వాది అమర్‌నాథ్, బోగ రాజయ్య, అంబటి శ్రీనివాస్, ఊరగొండ లత, ఖాదర్, రమేశ్, గణేశ్, సుజాత, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వేములవాడఅర్బన్: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి కడారు సురేందర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించాలన్నారు. అధ్యాపకుల బదిలీలు, విద్యా వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలల్లో సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులున్నారు.

పరామర్శ

వేములవాడ: ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకుని వేములవాడకు చేరుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆదివారం రాత్రి ఆయన నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్ తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బోయినపల్లి: మండలకేంద్రంలో పద్మశాలీ సమాజసేవా సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిల్ల మల్లేశం, గౌరవాధ్యక్షుడిగా దూస రాజేశం, ఉపాధ్యక్షుడిగా భీమనాథుని రమేశ్, ప్రధానకార్యదర్శిగా మ్యాన కరుణాకర్, కోశాధికారిగా వాసాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా సిరిపురం ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా వాసాల అశోక్, సామల రాజశేఖర్, మ్యాన రమేశ్, స్వర్గం శ్రీశైలం, బిల్ల వెంకటనర్సయ్య, మహేశుని శ్రీధర్, బిల్ల రమేశ్, బిల్ల చంద్రమౌళి ఎన్నికయ్యారు.

రక్తదాన శిబిరం

రుద్రంగి: మండల బ్లడ్ డోనర్స్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రుద్రంగిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల బ్లడ్ డోనర్స్ సభ్యులు, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహ వీడాలని, ఆరోగ్యవంతంగా ఉండే ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకురావలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు ఇన్నోవేషన్ కౌన్సిల్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏఐసీటీఈ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ బండారు నవీన్ కుమార్, చేపూరి అభినయ్ కుమార్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రజని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

రుద్రంగి: మండలకేంద్రంలోని శ్రీ శివమార్కండేయ పద్మశాలీ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ సంఘం మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- వెలగని వీధిదీపాలు
- కోరుట్ల – వేములవాడ రహదారి వెంట అంధకారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారిలో వెలగని వీధిదీపాలు

రుద్రంగి: మండలకేంద్రంలోని కోరుట్ల – వేములవాడ ప్రధాన రహదారిలో సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మారింది. సెంట్రల్ లైటింగ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగక ప్రధాన రహదారి వెంట అంధకారం నెలకొంది. చీకటిపడితే చాలు ప్రయాణికులు ఈ దారిగుండా వెళ్లాలంటే జంకుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగానే..

మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏర్పాటు చేసిన కొద్దిరోజులకే వీధిదీపాలు వెలగడం లేదు. అధికారులు నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.కోటితో ఏర్పాటు..

సుందరీకరణలో భాగంగా రూ. కోటితో మండలకేంద్రంలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ పనులను 2020లో ప్రారంభించి 2021లో పూర్తిచేశారు. ప్రారంభించిన మూణ్నాళ్లకే లైట్లు వెలగడం లేదనే ఆరోపణలున్నాయి. రోడ్డు మరమ్మతు పనులతో సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ తొలగి లైట్లు వెలగడం లేదు. రూ. 50వేల విలువచేసే ల్యాడర్ కొనుగోలు చేసి ఉంటే రూ.కోటితో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలిగి నిధులు వృథాకాకుండా ఉండేవని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రుద్రంగిలోని కోరుట్ల – వేములవాడ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిపూట ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం కావడంతో పాములు, విషపురుగులు ప్రమాదం పొంచి ఉంది. త్వరగా సెంట్రల్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలి.

– దేశవేని భూమేశ్, రుద్రంగి

వృథాగా నిధులు



సుందరీకరణలో భాగంగా రూ.కోటి నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగక నిధులు వృథా అవుతున్నాయి. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేపట్టి ప్రభుత్వం గ్రామ సుదరీకరణ లక్ష్యం నెరవేరేలా చూడాలి.

– దేశవేని శ్రీనివాస్, రుద్రంగి

మరమ్మతు చేపడుతాం



రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్లు పోయాయి. ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే మరమ్మతులు చేపట్టి సెంట్రల్ లైట్లు వెలిగేలా చూస్తాం. ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– రాందాస్, పంచాయతీ కార్యదర్శి, రుద్రంగి

చేసిన సేవలు గుర్తుండిపోతాయి



రిటైర్మెంట్ ఉద్యోగులు, ఉద్యోగుల సంఘం నాయకులతో ఈవో రామకృష్ణ

వేములవాడ: ఉద్యోగులు తమ సర్వీస్ సమయంలో చేసిన సేవలు గుర్తుండిపోతాయనని, రాజన్న సన్నిధిలో భక్తులకు సేవచేసే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావించాలని ఆలయ ఈవో రామకృష్ణ అన్నారు. రాజన్న ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి రిటైర్మెంట్ పొందిన డి.శేఖర్ (ఎలక్ట్రికల్ ఏఈ), కొంటికర్ల రామయ్య శర్మ, (హార్మోనిస్ట్), బొడుసు నర్సయ్య, (జూనియర్ అసిస్టెంట్), పి.శివరాజ్ (జూనియర్ అసిస్టెంట్), జి.లింగయ్య (స్కావెంజర్),లను శాలువాతో సత్కరించారు. ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంకేపల్లి హరికిషన్, గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, ఈఈ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి



ఎల్లారెడ్డిపేట: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి దశదిన కర్మ ఆదివారం హైదరాబాద్‌లో జరగగా కాంగ్రెస్ మండల నాయకులు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సత్యంను పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఏలూరి రాజయ్య, బండారి బాల్‌రెడ్డి, బుగ్గ కృష్ణమూర్తి, లింగంగౌడ్, గౌస్, తిరుపతి, సంతోష్‌గౌడ్, రాజేందర్, రాజునాయక్ తదితరులున్నారు.

శిలాఫలకం ధ్వంసం



తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రంగంపేట నూతన గ్రామ పంచాయతీని శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు శిలాఫలకం ధ్వంసం చేశారు. ఈ విషయంపై ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

బావుసాయిపేటలో పండ్లతోట..

కోనరావుపేట: ప్రభుత్వం కేటాయించిన భూమిలో నాటిన పండ్ల చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని మండలంలోని బావుసాయిపేటకు చెందిన ముదిరాజ్ కులస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామంలోని సర్వేనెంబర్ 242లో ఐదెకరాల భూమిని గతంలో ప్రభుత్వం ముదిరాజ్ సంఘానికి కేటాయించింది. అందులో సీతాఫలం, ఉసిరి, జామ ఇతర పండ్లమొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో చెట్లను తొలగించారు. తాము వెళ్లేసరికి జంగం పద్మయ్య అనే వ్యక్తి అక్కడి నుంచి వస్తున్నాడని, అతడిని విచారించాలని కోరుతూ చొక్కాల రమేశ్, దేవరాజు, కర్నాల రాములు, శంకర్, కృష్ణ, బాబు, శ్రీనివాస్, పంబాల భద్రయ్య, ఆరెభూమయ్య, శంకరయ్య, అనిల్, తదితరులు ఫిర్యాదు కోరారు.

ఫలితాల్లో మిన్న.. వసతులు సున్నా



శిథిలావస్థలో కొలనూర్ ఉన్నత పాఠశాల

- శిథిలావస్థలో కొలనూర్ ఉన్నత పాఠశాల
- వర్షాలకు తడుస్తున్న గోడలు.. ఉరుస్తున్న పైకప్పులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



వర్షాలకు ఉరుస్తున్న పైకప్పు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. శిథిలగదుల్లోనే చదువుకున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలను మండలంలోనే గుర్తింపు తీసుకువచ్చారు. కొలనూర్ పాఠశాలలో విద్యార్థులకు ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడంలేదు. వర్షాలకు తరగతి గదుల్లోని పైకప్పులు ఉరుస్తున్నాయి. గదుల గోడలు వర్షాలకు తడుస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు. పాఠశాలలో 5 తరగతులకు గాను ప్రస్తుతం 85 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలోని నాలుగు గదులు పూర్తిగా శిథిలంకావడంతో రేకులషెడ్డులో పాఠాలు బోధిస్తున్నారు. ఒక తరగతి ఉండగా మరో గది ఆఫీస్ రూంగా వినియోగిస్తున్నారు.

ఫలితాల్లో ఘనం.. వసతులు అధ్వానం

కొలనూర్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో చదువుకున్న కీర్తన 9.5 జీపీఏ, వినయ్, సుప్రియలు 9.0 జీపీఏను సాధించారు.

గదులు ఉరుస్తున్నాయి



పాఠశాలలో తరగతి గదులు వర్షానికి ఉరుస్తున్నాయి. దీంతో చదువుకునేందుకు ఇబ్బందిగా ఉంది. భవనాలు కూడా ఎప్పుడు కూలు తాయో తెలియని పరిస్థితి నెలకొంది. శిథిలమైన భవనాలను తొలగించి తరగతి గదులకు నూతన భవనాలను నిర్మించాలి.

– ఓరగంటి మనీషా, ఏడో తరగతి

ఆరుబయటే చదువుతున్నాం



పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరడం, పైకప్పులు ఉరుస్తుండడంతో ఆరో తరగతి విద్యార్థులంతా ఆరుబయట కూర్చొని చదువుకుతన్నాం. పాఠశాలకు అవసరమైన తరగతి గదులు నిర్మించి ఇబ్బందులు తొలగించాలి.

-బుర్ర సాకేత్, ఆరో తరగతి

ఎల్‌వోసీ అందజేత

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన మంగలిపల్లి నర్సింలు కూతురు శిరీష అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యచికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడు హమీద్, పట్టణశాఖ అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు చంద్రారెడ్డి, రాజు, ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ మోటారుకు మరమ్మతు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బోర్ మోటారును ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు మరమ్మతు చేశారు. కొంతకాలంగా బోరు పని చేయకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రెండ్రోజులక్రితం గ్రామస్తులు ఎంపీడీవో సత్తయ్యకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారి దేవరాజ్‌ను బోరు మరమ్మతు చేయాలని ఆదేశించగా అధికారులు, పంచాయతీ సిబ్బంది మరమ్మతులు పనులు చేపట్టారు.

‘మన్ కీ బాత్’ ను వీక్షించిన బీజేపీ నాయకులు



కోనరావుపేట: ప్రధాని నరేంద్రమోదీ మూడోసారి పదవిబాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు టీవీల్లో వీక్షించారు. మండలకేంద్రంలో మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, నాయకులు మోతుకు మోహన్, బోయిని నర్సయ్య, అబ్బసాని రాములు, చింతల పర్శరాములు, మల్లేశం, జనార్దన్, ధర్మారంలో మిర్యాల్‌కార్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు వీక్షించారు. పార్టీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, తిరుపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన జరగగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇచ్చిన గర్భిణులు సంఖ్యలో తేడా ఉండడంపై మున్ముందు ఇలాంటి తప్పులు దొర్లితే చర్యలు తప్పవన్నారను. మండలకేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని తరలించుకుండా అడ్డుకున్నానని, పక్కా భవన నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరుచేయిస్తానన్నారు. అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన మోత్కురావుపేట రోడ్డు పనులు తిరిగి నెలరోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. స్వశక్తి సంఘాలకోసం మంజూరైన వివిధ పథకాలపై ఎంపీటీసీలకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని బండపల్లి ఎంపీటీసీ గడ్డం రణధీర్ ఐకేపీ ఏపీఎం రజితను ప్రశ్నించారు. పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రభుత్వం స్కావెంజర్లను నియమించాలని సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివా స్‌రావు, కేడీసీసీ డైరెక్టర్ కిషన్ రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ పవన్‌కుమారి, వ్యవసాయాధికారి దుర్గారాజు, పశువైద్యాధికారి నితీన్‌కుమార్, ఏపాధి హామీ ఏపీవో రాజయ్య, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ అబ్రహం, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ప్రజలతో మమేకమే అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల ప్రాదేశిక సభ్యుల పదవికాలం జూలై 4లోపు ముగియడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలను, మండల కోఆప్షన్ సభ్యులను మండల అధికారులు శాలువాలతో సన్మానించి, మెమోంటోలు అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని పలు గ్రామాలకు చెందిన 45మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, తదితరులు అందించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రదీప్ కుమార్, సెస్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేములవాడ : వేములవాడ పట్టణంలోని గీత విద్యాలయంలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం రోజంతా సరదాగా గడిపారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి కరస్పాండెంట్ ఆయాచితుల రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, భానుప్రకాశ్, పూర్వ విద్యార్థులు సీఏ ఆర్. సంపత్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, లయన్స్‌క్లబ్ పట్టణ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, కిశోర్, క్రాంతి, ఉపేందర్, తిరుపతి, మధు, సుమ, సంధ్య, వరలక్ష్మి, సునీత, రాజేంద్రప్రసాద్, నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కనుకయ్య, అనిల్, సతీశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్ ఆదివారం పీవీ నర్సింహారావు స్మారక జాతీయ అవార్డును ఆదివారం అందుకున్నారు. తెలుగు– వెలుగు జాతీయ పురస్కారాల్లో భాగంగా కరీంనగర్‌లో రమేశ్‌కు అవార్డును అందజేశారు. జాతీయ అవార్డు అందుకున్న రమేశ్‌ను పలువురు అభినందించారు.

పర్సు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికులు ఆదివారం తన పర్సును పోగొట్టుకుంది. ఆర్టీసీ కానిస్టేబుల్ రాజుకుమార్ పర్సును గమనించి అందులోని ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాడు. పర్సులో నగదు, ఆధార్‌కార్డు ఉండగా ఆమెకు అందించాడు. ప్రయాణికురాలికి పర్సును అప్పగించిన కానిస్టేబుల్ రాజుకుమార్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ మురళికృష్ణ అభినందించారు.

‘పిన్నింటి’కి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న హన్మాండ్లు

వేములవాడ: వేములవాడకు చెందిన పిన్నింటి హన్మాండ్లుకు పురస్కారం వరించింది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో ఆదివారం పురస్కారం అందజేశారు.

నేడు మండల సమావేశం

వీర్నపల్లి: మండల కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ స భ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.



వ్యాయామం చేసేదెలా ?



గంభీరావుపేట: మండలకేంద్రంలోని నమాజ్ చెరువును ఆనుకొని ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరిసరాలు అధ్వానంగా మారాయి. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో వ్యాయామం చేసే వారికి ఇబ్బంది తప్పడం లేదు. చిన్నారులు ఆడుకునే వీలు లేకుండా పరికరాల చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తుండటంతో ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో పాములు, విషపురుగులు కూడా తిరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఓపెన్ జిమ్ ఏరియాను శుభ్రం చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.